## జా న కి

"అమ్మాయ్ జానకీ మాత్రలు తీసుకొస్తావా" గదిలోనుంచి నీరసంగా అడిగాడు మాధవరావు.

"వస్తున్నా నాన్నా! డికాషన్ వడబోస్తున్నాను" జానకి జవాబు.

"చిన్నమ్మ గారూ! అంట్లగిన్నెలు ఇటితే్త తోమేల్లిపోతా. ఇయ్యాల పొద్దెక్కిపోయింది. ఇంకా కామేశ్వరమ్మగారింటికి యల్లాలి" బావిదగ్గర నీళ్ళు తోడుతూ అడిగింది పనిమనిషి లక్ష్మి.

"వస్తున్నానే. ఇదిగో నాన్నకి మాత్రలు, కాఫీ ఇచ్చేసి...."

"కాని, కాని ఎల్లాల" గొణిగింది లక్ష్మి.

తండ్రి గదిలోనుంచి వస్తూనే అంట్ల గిన్నెలు తీసుకెళ్ళి లక్ష్మి ముందుంచింది జానకి.

అంట్లు కడగడం మొదలు పెట్టింది లక్ష్మి.

కాఫీ తాగుతూ బియ్యం చేటలో పోసుకొని కూర్చుంది జానకి.

"అక్కా ఇవ్వాళ ప్రయివేటు క్లాసుంది. ఎనిమిదింటికే వెళ్ళాలి స్కూలికి" అప్పుడే నిద్రలేచిన రవి కళ్ళు నలుపుకుంటూ చెప్పాడు.

"అలాగే, ముందర మొఖం కడుక్కురా. కాఫీ తాగుదువు" అంటూ బియ్యం గిన్నె పట్టుకుని వంటింట్లోకి నడిచింది.

"అమ్మాయ్ జానకీ"

"ఏంటన్నయ్యా! వస్తున్నా గబగబా చంద్రంగదిలోకివెళ్ళింది.

"నా బనీనేదమ్మా" కొంచం విసుగ్గానే అడిగాడు చంద్రం.

"తాడుమీదే వుండా లన్నయ్యా"

"లేదమ్మా. చూశాను. ఏదీ" మళ్ళీ ఒకసారి తాడుమీదున్న గుడ్డలన్నీ గాలించేడు.

కుర్చీలో చిందర వందరగా వున్న గుడ్డల్లో వెతుకుతున్నది జానకి.

"రోజూ చాకలి వుతికిన గుడ్డలు తీసుకురాగానే నాగుడ్డలన్నీ ఇదిగో ఈ మంచంమీద పడేయమ్మా, కనిపిస్తూ వుంటాయి. నే నేమో పెందలాడే వెళ్ళాల్సిన వాడిని. లేచిన దగ్గర్నుంచి నువ్వు పనిలో వుంటావు" చిరుకోపం కనిపించింది అతని మాటల్లో.

మళ్ళీ మళ్ళీ ఈ మాట చెప్పించు కున్నందుకు సిగ్గుపడింది జానకి.

"ఈ రోజు నుంచీ అలానే చేస్తానన్నయ్యా" అంటూ బనీను అతనికిచ్చి వెళ్ళింది.

బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టి కూర తరుగుతూ కూర్చుంది.

"అక్కా నేవెళ్తున్నా, మధ్యాహ్నం వచ్చి తింటాలే అన్నం. ఇప్పటికే ఆలస్యం అయ్యింది" చొక్కా గుండీలు పెట్టుకుంటూ వంటింట్లోకి వచ్చాడు రవి.

"చద్ది అన్నం వుందిరా. తినివెళ్ళు పెడుతున్నా" అంటూ కంచం పెట్టింది.

ఇప్పుడు టైం లేదంటూ పుస్తకాల సంచి సర్దుకుంటున్నాడు రవి.

బలవంతాన అన్నం తినిపించింది జానకి. రవి స్కూలుకి వెళ్ళిపోయాడు.

"ఈగోనమ్మా గిన్నెలు. లోన పెట్టుకో. నే వెడుతున్నా"లక్ష్మి పిలుపుతో బయటకు వచ్చి గిన్నెలన్నీ వంటింటిలో సర్దుకుంది.

"అన్నయ్యా! ఈగో కాఫీ" ఆఫీసుకు వెళుతున్న చంద్రానికి కాఫీగ్లాసు అందించింది. రోజూ అలవాటు ప్రకారం.

కాఫీతాగి క్యారియర్ తీసుకొని చంద్రం ఆఫీసుకు వెళ్లాడు.

మాధవరావుగారి స్నానాలు, వగైరాలన్నీ పూర్తి చేయించి ఉతికిన బట్టలు కట్టించి మళ్ళీ మంచం మీద పడుకోబెట్టింది.

"అమ్మాయిగారు" చాకలి పిలుపుతో విడిచిన గుడ్డలన్నీ తెచ్చి ఆమె ముందర పడేసింది. ఒక్కొక్కటి లెక్కపెడుతూ ఓ పెద్ద గుడ్డ పరచి దాంట్లో పడేస్తుంది చాకలి. అవన్నీ వివరంగా వ్రాసుకున్నది జానకి.

చాకలి వెళ్లిపోయింది.

వీధి తలుపులు వేసొచ్చి తండ్రిచేత భోజనం చేయించి తనూ భోజనం పూర్తిచేసి తనగదిలోకి వెళ్ళి మంచంమీద వాలింది జానకి.

"లేచిందగ్గర్నుంచీ వూపిరాడని పని. ఏమిటో ఈ జీవితం. అమ్మ వుంటే నేనూ అందరిలా చదువుకునేదాన్ని. ఆమె నా చిన్న

తనంలోనే చనిపోవడం నా దురదృష్టం. అయినా ఇంకా ఎన్నాళ్లలే ఈ కష్టాలు. ఇంకో నెల. ఆ తర్వాత పెళ్లి. అత్తగారింటికి వెడితే అక్కడ ఒకరికొకరు సాయంగా పనిచేసుకోవచ్చు. ఇంత ఇబ్బంది వుండదు" ఆలోచిస్తూ పడుకుంది జానకి.

తను పెళ్ళయివెళ్ళిపోతే పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి గురించి, చిన్నవాడయిన తమ్ముడు రవి గురించి, ఇంటి బరువుబాధ్యతలు చూస్తున్న అన్న చంద్రం గురించి జానకికి ఏమాత్రం బెంగ లేదు. అందుక్కారణం లేకపోలేదు. తన పెళ్ళవగానే చంద్రం మేనమామ కూతురు సరోజని పెళ్ళి చేసుకుంటాడు. సరోజకి చంద్రం అన్నా, మాధవరావుగారన్నా ఎనలేని అభిమానం. పరాయిపిల్ల కాకపోవటంతో తనలానే సరోజకూడ తన తండ్రిని, తమ్ముడ్ని ప్రేమగా చూసుకుంటుందని జానకి విశ్వాసం.

★ ★ ★

"ఏమోయ్ జానకీ" రాజారామ్ పిలుపు.

"వస్తున్నానండీ"

బ్రష్, పేస్టు తీసుకెళ్లి భర్త చేతికిచ్చింది.

స్టౌ వెలిగించి కాఫీ పెట్టింది.

పనిమనిషి వచ్చి వంటింట్లో అస్తవ్యస్తంగా పడివున్న అంట్లగిన్నెలు తీసుకెళ్ళింది.

"ఇవ్వాళ ఆడిట్ వర్కు వుందోయ్ ఓ అరగంట ముందరగా వెళ్ళాలి. వంట త్వరగా కానిచ్చి క్యారియర్ రెడీ చెయ్యి" అంటూ న్యూస్‌పేపరు పటుకొని వరండాలోకి నడిచాడు. రాజారామ్.

"అమ్మా! ఇవ్వాళ్టినుంచి కాలేజి షిఫ్ట్ సిస్టమ్. ఎనిమిగింటికే

వెళ్ళాలి చెప్తున్నా" స్నానానికి వెళుతూ తల్లిని హెచ్చరించాడు శీను.

"మమ్మీ, నా పరికిణీ, ఓణీ ఎక్కడ పెట్టావ్" కూతురు శాంతి పిలిచింది తల్లిని.

శాంతికి కావాల్సిన బట్టలిచ్చి వంటపనిలో నిమగ్నమైంది జానకి.

పిల్లలకు పని చెబితే ఊరుకోడు రాజారామ్. పిల్లలిద్దర్నీ గారాబంగానే పెంచారు జానకి, రాజారామ్. చిన్నతనంలోనే తల్లి పోయిన కారణంగా ఇంటిపనులు తనపై పడి చదువుకోలేక పోయానే అలోచన వున్న జానకి తన కూతురు పెద్దచదువు చదవాలన్న కోరికతో శాంతిని పనిజోలికే రానిచ్చేది కాదు.

క్యారియర్ తీసుకుని రాజారామ్ ఆఫీసుకు వెళ్లాడు. శీను, శాంతి భోజనాలు చేసి కాలేజీలకు వెళ్ళారు.

"జానకీ ఇక నాపని చూస్తావా తల్లీ" అత్తగారి అభ్యర్థన.

భర్తను పిల్లల్ని పంపాక ఆమెకు మళ్ళీ ప్రత్యేకంగా (పత్యం కోసం) వంటచెయ్యాలి.

ఆ పని పూర్తిచేసి అత్తగారితోపాటు తనూ భోజనంముగించి పిల్లలకోసం ఎదురుచూస్తూ నడుం వాల్చింది జానకి.

పుట్టింట్లో వున్నన్నాళ్లూ పనితోనే సరిపోయింది. పెళ్ళయితే తనకి అంత కష్టం వుండదనుకుంది. కాని తను ఎదురు చూసినంత కాలం పట్టలేదు. పెళ్ళయిన మొదట్లో ఓ నాలుగు సంవత్సరాలు మాత్రం తనూ, భర్తా వేరే వూర్లో కాపురం హాయిగా సాగిపోయింది.

ఆ తర్వాత పిల్లలు పుట్టడం, అంతలోకే జానకి మామగారు పోవడంజరిగింది. పిల్లలతో చేసుకోలేకయితేనేం, అత్తగారు ఒక్కతే వుండలేరనుకోవటంవల్ల నయితేనేం మళ్ళీ సొంతవూరు రాజారామ్ ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటం,వచ్చిన సంవత్సరానికే అత్తగారి ఆరోగ్యం చెడిపోవడం మళ్ళీ జానకికి వూపిరాడని పని మొదలయింది.

"వచ్చే సంవత్సరం శీనుకి చదువు పూర్తవుతుంది. వాడికి ఏదో చిన్న వుద్యోగం చూసి వెంటనే పెళ్ళి చెయ్యాలి. ఇక నేనుఈ పని చేయలేను. కోడలికి బాధ్యతల్ని అప్పగించాలి" ఆలోచిస్తూ పడుకున్న జానకి పిల్లలు రావటంతో ఆలోచనలనుంచి తేరుకున్నది.

★ ★ ★

"అమ్మా ఆఫీసు టైం అయింది. వంట పూర్తయిందా" శీను హడావిడి.

"అత్తయ్యాగారూ! ఇవ్వాళ నేను వచ్చేసరికీ ఆలస్యం అవుతుందేమో" సాయంత్రం పూట తన డ్యూటీకూడా అత్తగార్నే చేయమన్నట్లు చెప్పింది కోడలు రమ.

"అట్లాగేలేమ్మా, ఏముంది, ఆ కాసిన్ని బియ్యం పొయ్యిమీద పడేస్తే అవే వుడుకుతాయి" జానకి సమాధానం.

శీను ఇష్టప్రకారం రమని పెళ్ళిచేసుకున్నాడు. రమ వుద్యోగం చేయడం మానుకుంటే ఇల్లు గడవదు. రాజారామ్ ఓపికలేక ఉద్యోగం మానేసి ఇంట్లోనే వుంటున్నాడు. కోడలి సహాయం ఆశించిన జానకికి నిరాశే ఎదురైంది.

రమ స్కూల్ టీచరుగా పనిచేస్తున్నది. రోజూ బస్‌లో ప్రక్క పల్లెటూరు వెళ్ళిరావాలి. అందుకని ఉదయం ఇంట్లో పని చెయ్యటం రమకి కుదరదు. శీనుకి, రమకీ ఆఫీసు టైం కు క్యారియర్స్ తయారు చేసి యివ్వటం జానకి డ్యూటీ అయిపోయింది.

పెండలాడే వచ్చిన రోజున రమ వంటపని చేస్తుంది. ఆలస్యం అయిన రోజు ఆపని కూడా జానకే పూర్తి చేస్తుంది.

ఇంట్లో పని రాజారామ్ అసలు ముట్టుకోడు పైగా తన పని ప్రతిదీ జానకే చూడాలి. పని చేయలేక పోతున్నానని ఎప్పుడైనా జానకి విసుక్కుంటే ఆరోజు కాస్త అటువస్తువు ఇటు పెడతాడు. మళ్ళీ మామూలే. రోజులు గడిచిపోతున్నై.

వయసు మీరినందున బలహీనత, శారీరకంగా, మానసికంగా కూడా కృంగిపోయింది జానకి. రోజు రోజుకు ఆమె ఆరోగ్యం దిగ జారి పోయింది. మనుమడు, మనుమరాలు వీరిద్దరి సంరక్షణ ఇప్పుడు ఆమె క్రొత్త బాధ్యత. జానకి పూర్తిగా శక్తి కోల్పోయింది. డాక్టర్లు ఆమెకు పూర్తి విశ్రాంతి కావాలని చెప్పారు. కోడలు రమ పూర్తిగా కాకపోయినా ఎక్కువగానే ఇంటిపన్లు చూస్తున్నది. ఇంటి పని, ఆఫీసు పని చేయలేక తరచుగా విసుక్కోవటం, ఫలితంగా ఆమె కోపం పిల్లలమీద చూపడం జరుగుతున్నది.

జానకి పూర్తిగా మూలబడటంతో తెలిసింది ఆ యింట్లోఅంద రికీ ఆవిడ విలువ.

కుటుంబంలో ఒక్కడే సంపాదిస్తూంటే అందరూ కూర్చొని తినటం కూడా తప్పుకాదు గాని, యింట్లో అందరి పనులూ ఒక్కరే చేస్తుంటే ఎవరికి వారు సోమరిపోతుల్లా తప్పించుకు తిరగటం చాలా అన్యాయం.

ఈ విషయాన్ని ఆ యింట్లో అందరూ లేట్‌గా తెలుసుకు న్నారు. కాని పాపం "లేట్ జానకి"కి మాత్రం వారి గ్రహింపు ఉపయోగపడదు కదా !

(ఆదివారం — డి. 8-6-84)